క్లుప్తంగా

చెస్‌లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సూర్యాపేట టౌన్ : సూర్యాపేట స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఉమ్మడి నల్లగొండ జిల్లా చదరంగ సమాఖ్య సంయుక్తంగా కోదాడ పబ్లిక్ క్లబ్‌లో నిర్వహించిన చదరంగ పోటీల్లో సూర్యాపేటకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో 200 మందికి పైగా పాల్గొనగా 20 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 20 మందిలో ఆరుగురు సూర్యాపేటకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు చెస్ కోచ్ అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–17 బాలికల విభాగంలో ఇందిరా ప్రథమ, రమ్య ద్వితీయ, లిప్సిక శివాని తృతీయ, తన్వీర్ నాలుగో స్థానంలో ఎంపికైనట్లు పేర్కొన్నారు. అలాగే అండర్–14 బాలికల విభాగంలో శృతిక, అండర్–14 బాలుర విభాగంలో దీక్షిత్‌లు రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 9, 10వ తేదీల్లో మేడ్చల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట మండలం బాలెంల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్ 17 ఖో ఖో బాలికల టోర్నమెంట్‌లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని పి.లక్ష్మీప్రసన్న, తొమ్మిదవ తరగతికి చెందిన బి.శ్రావ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జెల్లా ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్థికసాయం అందజేత

సూర్యాపేట : చివ్వెంల మండలం సూర్య నాయక్ తండాకు చెందిన ట్రాక్టర్ మెకానిక్ జాటోత్ వీరన్న ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబానికి ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాందేని ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు అక్బర్, ప్రధాన కార్యదర్శి పల్స మహేష్, కోశాధికారి అనిల్ కుమార్, గౌరవ సలహాదారులు యూసుఫ్, రాయపాటి శ్రీను, కుంచారపు నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలి

మద్దిరాల : 50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని టీపీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి నాగయ్య అన్నారు. శుక్రవారం కుక్కడం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో భోజన విరామ సమయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 317పై నియమించిన కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని అన్నారు. అనంతరం టీపీటీయూ జిల్లా శాఖ అనుమతితో ఆ సంఘం మండల కన్వీనర్‌గా కాసర్ల వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

ఆత్మకూర్(ఎస్) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బీసీ కుల గణన సర్వేను అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ వేణు మాధవరావు అన్నారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కులగణన సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి డాటాను ఉన్నతాధికారులకు పంపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్ కుమార్, ఎంపీడీఓ హసీం, ఎంఈఓ ధారాసింగ్, ఎంపీఓ రాజేష్, ఏపీఓ ఈశ్వర్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ వీరన్నకు సన్మానం

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రానికి చెందిన ఎస్‌ఐ వీరన్నను జిల్లా బ్రాంచ్ ఎల్‌ఐసీ యూనియన్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ సూర్యాపేట బ్రాంచ్ అధ్యక్షుడు మట్టిపల్లి గంగయ్య, ముత్తినేని లింగయ్య, తుమ్మ రామచంద్రారెడ్డి, గుగులోతు సురేందర్‌నాయక్, దండా భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇచ్చారు.. వసతులు మరిచారు

- అడివెంలలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీలో కొరవడిన కనీస సౌకర్యాలు
- విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో ప్రజలు
- డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో వీధుల్లోనే పారుతున్న మురుగు
- తాగునీటికీ తప్పని ఇబ్బందులు



అడివెంలలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీ



డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో వీధిలో నిలిచిన మురుగు నీరు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అడివెంల గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం జరిగింది. ఈ ఇళ్లలోకి గృహ ప్రవేశాలు కూడా పూర్తయ్యాయి. కానీ కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అడివెంల గ్రామ శివారులో 25 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అప్పట్లోనే లబ్ధిదారులను ఎంపికచేసి ఇళ్లు కేటాయించగా ఇళ్ల లబ్ధిదారులు వాటిలో నివాసముంటున్నారు.

నిర్మించారు.. వసతులు మరిచారు

అడివెంల గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీలో ఇంతవరకు విద్యుత్ వసతి కల్పించలేదు. గ్రామ శివారులో ఉన్న ఈ కాలనీకి విద్యుత్ లైన్లు కూడా లేవు. దీంతో కొందరు దూరం నుంచి తాత్కాలికంగా వైర్లను గుంజి లైట్లు వెలిగించుకుంటున్నారు. సాయంత్రమైతే ఈ కాలనీలో కరెంట్‌లేక అంధకారంగా మారుతోంది. దీనికి తోడు సరైన నీటి వసతి లేదు. మిషన్‌భగీరథ నీళ్లు కూడా కాలనీకి వెళ్లడంలేదు. ఈ కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం కూడా చేపట్టలేదు. దీంతో మురుగు నీరు మొత్తం వీధుల్లోనే నిలిచి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడిన ప్రతిసారి వర్షపునీరు ఇక్కడి వీధుల్లో చేరి ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది.

వసతుల కోసం ఎదురుచూపు..

అడివెంల గ్రామంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీలో విద్యుత్ స్తంభాలు బిగించి విద్యుత్‌లైన్ ఏర్పాటు చేయాలని, కరెంట్ సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే కాలనీలోని వీధులను సీసీ రోడ్లుగా మార్చి మురుగు కాలువలను నిర్మించాలని, వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

కరెంట్ వసతి కల్పించలేదు



అడివెంల గ్రామంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీలో మాకు ఇళ్లు కేటాయించి ఏడాది దాటింది. కానీ ఇంతవరకు మాకు కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించలేదు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అంధకారంలో ఉంటున్నాం. తాత్కాలికంగా కొంత దూరం నుంచి వైర్ గుంజి కరెంట్ వాడుకుంటున్నాం.

– బత్తుల సైదులు, కాలనీవాసి

మురుగునీరు నిలుస్తోంది



మా డబుల్ బెడ్‌రూం కాలనీలో మురుగు కాలువలు నిర్మించలేదు. దీంతో మురుగునీరు వీధుల్లోనే నిలుస్తోంది. దుర్వాసనతో ఇళ్లలో ఉండలేక పోతున్నాం. సీసీ రోడ్లు నిర్మించలేదు. వీధులు పిచ్చిచెట్లతో నిండి అధ్వానంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు వసతులు కల్పించాలి.

– ఉడుగు ఉప్పలయ్య, కాలనీవాసి

నీటి సౌకర్యం లేదు



మా కాలనీలో ఇళ్లు తప్ప ఏ వసతి లేదు. సరైన నీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నాం. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. వర్షాలు పడితే కాలనీ మొత్తం చెరువులా మారుతోంది. నీళ్లు ఎండిపోయేవరకు ఇళ్లలోనుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే తీర్చాలి.

– అనిత, కాలనీవాసి

శ్రీసంతోషిమాత ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

సూర్యాపేటటౌన్ : కార్తీక మాసం మొదటి శుక్రవారం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషిమాత అమ్మవారికి దేవాలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివ రామకృష్ణ శర్మ ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించి, అమ్మవారి సన్నిధిలోని శ్రీ చక్రానికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. 21 రకాల హారతులతో అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడారు. శ్రీ సత్య సాంబ శివ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామమూర్తి, కమిటీ సభ్యులు పబ్బ ప్రకాశ రావు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, బెల్దే అశోక్, సోమ శ్రీశైలం, దేవరశెట్టి సోమయ్య, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తుంగతుర్తి : సైబర్ నేరాల పట్ల అప్రమత్తతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తుంగతుర్తి సర్కిల్ సీఐ శ్రీనునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై కళాబృందంచే అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణశ్రీ, పోలీసు సిబ్బంది గోపి నాయక్, సైదులు, రాంబాబు, కళాబృందం సభ్యులు ఎల్లయ్య, గోపయ్య, గురులింగం, కృష్ణ, నాగార్జున, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

అర్వపల్లి : డ్రగ్స్, గంజాయి, మద్యపానం, ధూమపానం వంటి మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని మండల నోడల్ అధికారి, తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం కుంభం ప్రభాకర్ కోరారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా శుక్రవారం గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను పాడుచేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సయ్య, ఉపేందర్, కృష్ణయ్య, కొండా వెంకన్న, సీహెచ్. రవీందర్, కె.రవీందర్, సీనయ్య, శ్రీనివాస్, శేఖర్, మాధవి, రెహనాబేగం, రామాంజనేయులు, మహబూబ్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

నాగారం : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 9, 10న నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ డేపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ వాసం ప్రభాకర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

తుంగతుర్తి : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ దయానంద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ కంఠమయ్య, ఆర్ఐ శ్రీనివాస్, గిరి, నర్మద, జమున, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీల అమలులో ఆలస్యం తగదు

నాగారం : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో అలస్యం చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. శుక్రవారం నాగారం మండల కేంద్రంలో సీపీఎం మండల 3వ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దలకు అనుకూలమైన నిర్ణయాలు చేస్తూ పేదలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు యాకలక్ష్మి, మండల కార్యదర్శి కడియం కుమార్, మండల కమిటీ సభ్యులు గుడిపురి వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ, కోట గోపి, పులుసు సత్యం పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

చివ్వెంల : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భావిపౌరులుగా ఎదగాలని ఎంఈఓ జి.కళారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో టీపీయూఎస్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎస్ఎస్) స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేష్, మాధవి, శ్రీనివాస్, క్రిష్ణ, నాగార్జున చారి, జానిరెడ్డి, శంకర్, భాషు, భవాని, సంఘమిత్ర, మణి, వెంకటరమణచారి, విద్యశ్రీ, మల్సూర్, నీలోఫర్, రమాదేవి పాల్గొన్నారు.

నర్సరీలకు మట్టిని సేకరించాలి

అర్వపల్లి : తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో మొక్కలు పెంచడానికై వన నర్సరీలకు వెంటనే మట్టిని సేకరించాలని ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని రామన్నగూడెం, కుంచమర్తి గ్రామాలలో శుక్రవారం వన నర్సరీలను పరిశీలించారు. అలాగే రామన్నగూడెంలో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను, మురుగు కాలువలను, వీధులను పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు దీపిక, నాగమణి, పంచాయతీ కార్యదర్శి మౌలాన, ఫీల్డ్ అసిస్టెంట్‌లు మల్లయ్య, ఏడుకొండలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఆత్మకూరు (ఎస్) : మండల కేంద్రంలో గురువారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన గిలకత్తుల చంద్రశేఖర్ మండలపరిధిలోని ఏనుబాముల రోడ్డులో ఎడ్లను మేపేందుకు తోలుకెళ్లాడు. ఎడ్లు మేత మేస్తున్న క్రమంలో ఓ ఎద్దు రోడ్డు వెంబడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది.

పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా వెంకన్న

తిరుమలగిరి : పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా వెలిశాల గ్రామానికి చెందిన పొన్నం వెంకన్నను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేటలో నియామకపత్రం అందజేశారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

నాగారం : ఈటూరు జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా బాధ్యుడు దబ్బేటి యాదగిరి, వర్దెల్లి మల్లయ్య, బింగి శ్రీనివాస్, రవి, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నూతనకల్ : డీటీఎఫ్ మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిపారు. అధ్యక్షుడిగా ఐరుగు యాదగిరి, ఉపాధ్యక్షులుగా సుధీర్, మంగు, విజయమ్మ, ప్రధాన కార్యదర్శిగా దామళ్ల వెంకన్న, కార్యదర్శులుగా నర్సింహాచారి, ఎం.సైదులుతో పాటు మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష మండల శాఖ అధ్యక్షుడు గొడుగు సోమేశ్వర్ యాదవ్ కోరారు. శుక్రవారం తిరుమలగిరిలో ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొడుగు సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా పోరెళ్ల వెంకన్న, కోశాధికారిగా సోమేష్, ఉపాధ్యక్షులుగాగా ఆర్.సుశ్మిత, పి.రాజీవ్, కార్యవర్గ సభ్యులుగా స్వప్న, కవిత, వాణి, సత్యనారాయణ, పార్వతమ్మ, వాణిశ్రీ, నీరజ, సునీత ఎన్నికయ్యారు.

కారు ట్రావెల్స్ యూనియన్ అధ్యక్షుడిగా అంబేద్కర్

సూర్యాపేట : సూర్యాపేట కారు ట్రావెల్స్ న్యూ హైటెక్ బస్టాండ్ యూనియన్ అధ్యక్షుడిగా మరికంటి అంబేద్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం పట్టణంలో జరిగిన యూనియన్ సమావేశంలో ఈ మేరకు సభ్యులంతా కలిసి ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు మైకేల్ శ్రీనివాస్, ఏనుమాముల ప్రసాద్, పర్వతపు కోటా చారి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వెంకట్, వీరయ్య, సంతు, ఉదయ రెడ్డి, వేణు, సైదులు, శేఖర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణ సేవ

సూర్యాపేట : పిల్లలమర్రి చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి పుష్పాలంకరణ సేవ నిర్వహించారు. కార్తీక మాసం కావటంతో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రఘువరన్ ఆచార్యులు, ఆలయ ధర్మకర్త హరిప్రసాద్, ఆలయ చైర్మన్ గూకంటి రాజాబాబురెడ్డి, ముదుంబై సారిక, దేవరశెట్టి నరహరి అనసూర్య, గవ్వ జానకిరెడ్డి, విజయలక్ష్మి, అంకం భిక్షం పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక చేయూత

తుంగతుర్తి : వెంపటి గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని శిగ గౌతమికి శుక్రవారం పలువురు ఆర్థిక చేయూత అందించారు. మాజీ ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్ సహకారంతో హైదరాబాద్‌కు చెందిన సీఐ శ్రీధర్‌కుమార్ రూ.10వేల విలువ గల సెల్‌ఫోన్, మాజీ ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్ రూ.5వేలు, పులుసు వెంకట నారాయణగౌడ్ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

ఐఏఎల్ మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న బొమ్మగాని శ్రీనివాస్

చివ్వెంల : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్‌రోడ్‌లో గల జేకే రెసిడెన్సీలో శనివారం నిర్వహించే ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని న్యాయవాదుల సంఘం జిల్లా నాయకుడు బొమ్మగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణపై నిర్వహించే ఈ మహాసభకు న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు తోగటి మురళి, తాళ్లపల్లి సత్యనారాయణ, దోరపల్లి రమేష్, డాకా శ్రీనివాస్ నాయుడు, నరసింహారావు, గూడూరు శ్రీనివాస్, నారాయణ, లతీఫ్, రాజారాం, ప్రతాప్, సైదులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పిల్లలమర్రిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్

సూర్యాపేట : రైతులు ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరతోపాటు బోనస్ పొందాలని వార్డు కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పిల్లలమర్రిలో సన్నధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట 32వ వార్డు కౌన్సిలర్ జహీర్, 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చింతా వెంకన్న, దేవాలయ చైర్మన్ తొట్ల సైదులు, సయ్యద్ సాధక్, మెప్మా సీఓ రోజా, ఆర్‌పీ సునీత, ఐకేపీ కేంద్రం నిర్వాహకులు చింతలచెరువు పద్మ, లక్ష్మమ్మ, నాగమణి, వీరమ్మ, యల్లమ్మ, సరిత, సాదక్, దోరపల్లి లింగయ్య, దోరపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

మద్దిరాల : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరతోపాటు సన్న ధాన్యానికి అందించే బోనస్ రూ.500లను పొందాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోరెంట్లలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని నోటు బుక్‌లో సీరియల్ ప్రకారం నోటు చేసుకొని, అదే ప్రకారం కాంటాలు పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నాగారం : ఐకేపీ నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య హెచ్చరించారు. శుక్రవారం పసునూర్, నాగారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శోభారాణి, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాల : గోరెంట్లలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్



నాగారం : పసునూర్ ఐకేపీలో ట్రక్‌షీట్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

పశుసంపదను అభివృద్ధి చేసుకోవాలి



రైతులకు పశు పోషక పదార్థాలను అందజేస్తున్న జిల్లా అధికారి శ్రీనివాసరావు

పెన్‌పహాడ్ : పశువైద్యాధికారుల సలహాలు పాటించి రైతులు పశుసంపదను అభివృద్ధి చేసుకోవాలని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని లింగాల గ్రామంలో పశు గర్భస్థ వ్యాధి చికిత్స శిబిరం, కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడల ప్రదర్శన, గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల పోషక పదార్థాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్‌పహాడ్ పశువైద్యాధికారి అనంతుల వెంకన్న, అనంతారం పశువైద్యాధికారి యర్రంశెట్టి కిరణ్‌కుమార్, గడ్డిపల్లి పశువైద్యాధికారి జయసుధ, పొనుగోడు పశువైద్యాధికారి శ్రీకాంత్, గోపాలమిత్రలు మహబూబ్ అలీ, నగేష్, వెంకన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అమరవీరుల వారోత్సవాలు



ఆత్మకూర్ (ఎస్) : బొప్పారంలో అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



నూతనకల్ : చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : అమరుల ఆశయాల సాధన కోసం నేటి యువత ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బొప్పారం గ్రామ కార్యదర్శి గుండెబోయిన వెంకన్న అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలం పరిధిలోని బొప్పారం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, నవీన్, రాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో పోరాడాలి

నూతనకల్ : అమరుల స్ఫూర్తితో నేటి యువత పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం. డేవిడ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గంటా నాగయ్య, కునుకుంట్ల సైదులు, బొడ్డు శంకర్, పోలెబోయిన కిరణ్, పెద్దింటి రంగారెడ్డి, సామ నర్సిరెడ్డి, సింహాద్రి, మండడి భూపాల్‌రెడ్డి, ముప్పాని సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



తిరుమలగిరి : వెలిశాలలో సీఎం జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు



అర్వపల్లిలో కేక్ కట్‌చేస్తున్న నాయకులు

తిరుమలగిరి : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ ఆధ్వర్యంలో తిరుమలగిరి, వెలిశాల గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పట్టణ శాఖ అధ్యక్షుడు వీరేష్, జమ్మిలాల్, అశోక్‌రెడ్డి, లక్ష్మయ్య, అబ్బాస్, లింగయ్య, మహేష్ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్ రెడ్డి, కౌన్సిలర్లు ఎం.జితేందర్, బత్తుల శ్రీను, రాము గౌడ్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలను శుక్రవారం అర్వపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి సోమయ్య, మాజీ జెడ్పీటీసీ కె. అవిలయ్య, చెంచల శ్రీనివాస్, బైరబోయిన మహరాజు, సైదులు, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నాగారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్మకంటి సోమయ్య, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొలిపాక సాయికుమార్, నాయకులు పానుగంటి నరసింహారెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్ రావు, దొంగరి గోవర్ధన్, చింతకుంట్ల వెంకన్న, దాయం ఝాన్సీరాజిరెడ్డి, పులి సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

నూతనకల్ : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గోపాలమిత్రల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాస్ లింగయ్య, గోపాలమిత్రలు లక్ష్మయ్య, మరికంటి సైదులు, లింగమూర్తి, సైదులు, పలు వురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



తుంగతుర్తిలో సీఎం జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు